# గుండె గుసగుసలు

ఈ రోజు ఆనందంతో నా మనసు పరవశించిపోతోంది. నిజానికి కారణం నాకే తెలీదు. లోకమంతా అందాల పూల తోటలా కనిపిస్తోంది. ప్రకృతి అందంగా వుంటే మనసు ఆహ్లాదంగా వుంటుందన్ని ఎవరేనా అనుకుంటే అది వట్టి మాటే. మనసు ఒక్కొక్కరోజు ఆనందంగా, ఉల్లాసంగా వుంటుంది. అప్పుడే లోకం అందంగా కనిపిస్తుంది.

ఇంతటి ఆనందం వెనుక నాకొక ఆరాటం లేకపోలేదు. ఈ రోజు నే నేదో గొప్ప విషయాన్ని సాధించబోతున్నానని పదే పదే అనిపిస్తోంది. అదెలాగా అని ఆరాటంగా వుంది.

ఈ రోజే సుధాకర్ ని కలిసి ఆ విషయం మాట్లాడేయాలి. మనసు లెప్పుడో పెనవేసుకుపోయాయి. ఇంక ఈ మాటలెందుకు అంటే, కేవలం మాట్లాడుకునేందుకే అని జవాబు.

నేను పేదపిల్లనే కావచ్చు. ఆడంబరాలు లేకపోవచ్చు నాకు. అందర్నీ ఆకట్టుకునే పెద్ద చదువూ లేకపోవచ్చు. కానీ చాలామంది నన్ను అందగత్తె అంటారు. ఒక్కసారి చూసినవాళ్ళు మళ్ళీ నావంక చూడకుండా వెళ్ళలేరు. అన్నిటికీ మించి నా మనసుకి ఎవ్వరూ విలువకట్టలేరని అంటాడు సుధ. అలాంటి మాటలు సుధనుంచి వింటుంటే సుధలొలికే పలుకులంటే యివే కాబోలు అనిపిస్తుంది.

అమ్మ కెప్పుడూ నామీద అనుమానమే. నా మాటలూ, భావాలు విని అదిరిపోతుంది. ప్రేమకి బీదా, గొప్పా లేదంటే నా వంక విడ్డూరంగా చూస్తుంది. వదిన మాత్రం మాటి మాటికి వంకర్లు తిప్పుతుంది. నేను రేపు సుధాకర్‌ని పెళ్ళిచేసుకుని, కోటీశ్వరుడి భార్యనయినప్పుడుగాని వదినకి తెలిసిరాదు. ఆమె కెప్పుడూ మూడువేల కట్నమిచ్చి మేష్టర్ని చూద్దామా, ఆరువేలదాకా పెట్టి గుమాస్తాని చూద్దామా అనే ఆలోచనలు. అమ్మగాని, వదినగాని నన్నెప్పుడూ అర్థంచేసుకోరు.

సుధాకర్ ఎంత అందంగా వుంటాడు! ఎంత గొప్ప బట్టలు వేస్తాడు! ఎంత ఠీవిగా నడుస్తాడు, ఎన్ని అందాలు వొలికిస్తాడు! ఒక్క చూపులో ఎంతో ఆనందాన్ని పంచి యిస్తాడు. అలాంటి సుధాకర్ నాకోసం ఎంత పరితపిస్తాడో వీళ్ళకి చెప్తే—అమ్మో ఇంకేమైనా వుందా!

అసలు వాళ్ళ బాబయ్యలు, మావయ్యలు అంతా ఫారన్‌లో వున్నారు. అందరూ ఎప్పుడూ ఏవో కానుకలు పంపిస్తూనే వుంటారు. అవన్నీ నాకు చూపిస్తాడు, ఇస్తానంటాడు. కాని నే నింట్లో చెప్పుకోలేక, అభిమానంగా తిరస్కరిస్తూ వుంటాను.

మొన్ననొక షర్టు వేసుకొచ్చాడు. గుండెలంతా పచ్చని పొదరిల్లు కప్పేసింది. అదేదో చాలా చిత్రంగా వుంది. అచ్చంగా అక్కడ ఒక పొదరిల్లు వున్నట్లే అనిపించింది. ఆ పొదరింట్లో పోయి కూర్చుందామా అనిపించింది. సుధాకర్ గుండె నా కొరకు పచ్చని పొదరిల్లే. అయితే నాకున్న ఈ పాపిష్టి సిగ్గువల్లగాని, లేకపోతే ఒక్కసారి ఆ పొదరింటి గుండెలో తలదాచుకునేదాన్నే.

నిన్న మాత్రం! మరొక అందమైన షర్టు వేసుకొచ్చాడు. దానిమీద జలపాతం తెల్లగా మంచుతుంపర్లు కిందకి దూకుతున్నట్లుగా గుండెల్లోంచి ప్రేమామృతం నాకోసం మున్దు కురుకుతున్నట్లు అనిపించింది. చేత్తో చల్లటి ఆ నీటి తుంపర్లని తాకాలనిపించింది—.

ఈరోజు కూడా ఫారిన్‌నుంచి వచ్చిన మూడో షర్టు వేసుకొస్తా నన్నాడు. ఇదెంత అందంగా వుంటుందో ! ఈరోజు మాత్రం ఒక్క క్షణం శక్తినంతా కూడదీసుకుని సిగ్గంతా మడిచి పక్కన పెట్టేసి ఆ గుండెలపై తల ఆన్చి సుధాకర్ గుండెల్లో గుడిగంటలు వినాలి— అవును వినాలి—. నేడో రేపో పెళ్ళిచేసుకోబోయే సుధాకర్ దగ్గర నాకేమిటి బిడియం ? ఆనందంతో ఎగసిపడే ఈ గుండెల్ని అదుపులో పెట్టుకోవాలి. పెళ్ళిమాట కూడా మాట తీసుకోవాలి.

ఎవ్వరూలేని ఈ పచ్చిక పరచుకున్న వెచ్చని ప్రేమలా వుంది. ఆకాశానికి, నేలకీ మధ్య అల్లుకున్న ఈ మామిడిచెట్టు గుబురు సుధాకర్‌కీ, నాకూ మధ్యన సిగ్గు దొంతరలా వుంది. ఎండైనా, వెన్నెలైనా జొరబడని ఈ చెట్టునీడ సుధాకర్ అనురాగపు పందిరిలా వుంది.

నా ఆలోచనల్లోంచి దూసుకుంటూ — అదిగో అతను రానే వచ్చాడు—. అంతే—, ఒక్కసారి నా గుండె ఝల్లుమంది. భయంతో నా శరీరం వొణికింది. నేను ఒక చిట్టడివిలో చిక్కుకుపోయినట్లు, రక్షించే వారెవరూ కనుచూపు మేరలో లేనట్లు అంతా శూన్యంగా అయిపోయింది.

అతని గుండెలుమీద పులి. అతి భయంకరమైన చిరుత పులి—, నోరు తెరచివున్న పులి—, కోరలు స్పష్టంగా కనిపిస్తున్న పులి— నల్లని గుండ్రంలో పసుపు పచ్చని మచ్చలతో పులి—, అత్యంత అధునాతనంగా షర్టుమీద చిత్రించిన పులి—, అతని గుండెల్లోంచి గాండ్రిస్తున్న పులి. ఆ పులి రూపాన్ని దాటి నా కళ్ళు పైకి వెళ్ళలేదు. సుధాకర్ కళ్ళతో కలవలేదు. అతని గుండెలో తలదాచుకోవాలనే కోరిక భయంకరంగా అయిపోయింది. నా తలని ఆ పులి నోట్లో పెట్టే ధైర్యం లేకపోయింది. గుడి గంటలకి బదులు పులి గాండ్రింపులు వినిపిస్తున్నాయి. కళ్ళు గట్టిగా మూసుకున్నాను. అమ్మ జ్ఞాపకమొచ్చింది. వదిన గుర్తుకొచ్చింది.